క్లుప్తంగా

అర్హులందరికీ రుణమాఫీ చేయండి



మహబూబాబాద్ రూరల్: అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలని కోరుతూ హైదరాబాదులోని సచివాలయంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావును ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ బుధవారం కలిసి విన్నవించారు.

సీసీ కెమెరాలతో భద్రత

డోర్నకల్: వీధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత కలుగుతుందని డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చి కాంపౌండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పది సీసీ కెమెరాలను బుధవారం సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో డోర్నకల్ బిషప్ రెవ.డాక్టర్ కె.పద్మారావు, ఎస్సైలు వంశీధర్, గడ్డం ఉమ, నాగేశ్వర్‌రావు, కానిస్టేబుళ్లు సైదులు, వీరన్న, మంగలాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

నెల్లికుదురు: ఆరుగాలం కష్టపడి పండించి చేతికందే సమయంలో అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి కొనుగోలు చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని రామన్నగూడెం గ్రామ ఐకేపీ కొనుగోలు సెంటర్‌లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని బుధవారం ఆయన పరిశీలించారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

డోర్నకల్/పెద్దవంగర: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి బోడెపూడి కిరణ్‌కుమార్ కోరారు. మండలంలోని తహసీల్దారు బంజర, సీతారాంపురం గ్రామాల్లో బుధవారం ఏర్పాటు చేసిన టీకాల శిబిరాలను డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.నాగేశ్వర్‌రావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

కోరుకున్న చోటే డ్యూటీలు వేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు ఓపెన్ టెన్త్ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయుల సంఘాల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఎంఈఓ వెంకటేశ్వర్లుతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సీనియార్టీ ప్రకారం విధులు నిర్వహించాలని, తమకు నచ్చిన ఉపాధ్యాయులను వారు అనుకున్న పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ పరీక్షలకు విధుల్లోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తు ఎంఈఓను ఒత్తిడి చేశారు.

బలోపేతానికి తోడ్పాటు అందించాలి

పెద్దవంగర: ప్రభుత్వ బడుల బలోపేతానికి ఉపాధ్యాయులు తమవంతు తోడ్పాటు అందించాలని ఎంఈఓ బుధారపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎర్రోజు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చిట్యాల క్లస్టర్ పరిధిలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీజీఈజేఏసీ జిల్లా సెక్రటరీగా లక్ష్మీకాంత్



కేసముద్రం: తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్ టీచర్స్ వర్కర్స్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా సెక్రటరీగా ఇనుగుర్తి గ్రామపంచాయతీకి చెందిన కార్యదర్శి గోపు లక్ష్మీకాంత్ ఎన్నికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కుల సంఘం పేరుతో అక్రమ వసూళ్లు

గూడూరు: ఏపూరు గ్రామానికి చెందిన బానోతు చందూ అనే వ్యక్తి కుల సంఘం పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, ఏజెన్సీ మండల కేంద్రంలో గిరిజన, గిరిజనేతరులపై అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నాడని మండల ధర్మయుద్ధం కన్వీనర్ కత్తి స్వామి, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు వాంకుడోతు కొమ్మాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామానికి వచ్చిన డీఎల్‌పీఓ కనకదుర్గకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, భిక్షపతి, పూర్ణచందర్, గౌరీ శంకర్‌గుప్త, మేరెడ్డి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయం.. అపరిశుభ్రం

- వ్యవసాయ మార్కెట్‌లో పనిచేయని నల్లాలు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు
- మురుగునీటి నిల్వతో రైతుల ఇక్కట్లు



అలంకారప్రాయంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు



మిర్చి షెడ్ల సమీపంలో నిలిచిన మురుగు నీరు



నిరుపయోగంగా మారిన తాగునీటి నల్లాలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు అలంకారప్రాయంగా మారి దర్శనమిస్తున్నాయి. గతంలో శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారడంతో మార్కెట్ అధికారులు వాటికి మరమ్మతులు చేపట్టారు. నెలరోజులు కావస్తున్నప్పటికీ వాటిని మాత్రం వినియోగంలోకి తీసుకురాలేదు. మార్కెట్ కమిటీ పాలకవర్గం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రైతులు, హమాలీలు, దడవాయులు, కూలీలు మలమూత్ర విసర్జన విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరమ్మతులు చేసిన సందర్భంలో సరైన వసతులు కల్పించకపోవడం ద్వారా అవి అలంకారప్రాయంగా మారిపోయాయి.

అపరిశుభ్రంగా మార్కెట్ పరిసరాలు..

కాగా వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని పలు ప్రాంతాల్లో పరిసరాలు అపశుభ్రంగా మారి దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసిన సరే వర్షపు నీరు మార్కెట్ షెడ్ల సమీపంలోకి చేరి నిలిచి ఉండి సమస్యాత్మకంగా తయారవుతుంది. రైతులు మిర్చి, మొక్కజొన్నలు, ఇతర సరుకులను షెడ్లలో ఏర్పాటు చేసుకునే సందర్భంలో అదే సమీప ప్రాంతంలో మురుగునీరు నిలిచి దుర్వాసన రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. షెడ్ల సమీపంలో నిలిచిన మురుగునీటిని తొలగించకపోవడంతో ఆయా ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా మారిపోతున్నాయి.

పనిచేయని తాగునీటి నల్లాలు..

వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని సివిల్ సప్లయి గోదాం పక్కనే ఉన్న తాగునీటి నల్లాలు పనిచేయటంలేదు. రైతులు, హమాలీలు, దడవాయులు, కూలీలు అందరు మంచినీళ్లు తాగటం కోసం నిర్మించిన నాలుగు నల్లాలు నిరుపయోగంగా మారాయి. ఈ కారణంగా సద్దిమూట భోజనం చేసిన రైతుల కోసం అదనంగా నీటిని తెప్పించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నల్లాలు ఉపయోగంలోకి తీసుకువస్తే అందరికి తాగునీటి అవసరాలు తీరే అవకాశం ఉంటుందని రైతులు తెలపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



పెద్దవంగర: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరిప్రసాద్

పెద్దవంగర: రైతులు పండించిన వరి ధాన్యంను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల గ్రామంలో తొర్రూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈఓ మురళీతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మండల ఇన్‌చార్జ్ విజయ్‌పాల్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్ నాయక్, రావుల వెంకటరంగా రెడ్డి, పాక శ్రీనివాస్, మహేష్, పులుగుజ్జ శ్రీధర్, శోభ, లావణ్య, శారద పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏపీఎం శంకర్‌నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు సుమేర్‌చంద్ జైన్, నాయకులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- నేలరాలిన మామిడి కాయలు
- వందలాది ఎకరాల్లో నేలవాలిన వరి పొలాలు
- లబోదిబోమంటున్న బాధిత రైతులు



నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో వరిలో నీటిని బయటికి తీస్తున్న రైతు



మరిపెడ రూరల్: అబ్బాయిపాలెంలో నేలరాలిన మామిడి కాయలను చూపిస్తున్న బాధిత రైతు



నర్సింహులపేట: తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు లూనావత్ వెంకన్న

మరిపెడ రూరల్/నెల్లికుదురు/నర్సింహులపేట/దంతాలపల్లి: మంగళవారం రాత్రి వీచిన గాలివాన బీభత్సానికి రైతంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో ఈదురుగాలులకు వందలాది ఎకరాల్లోని మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. అదేవిధంగా వరిపొలాలు నేల వాలిపోయాయి. లక్షల రూపాయలు మామిడి రైతులకు నష్టం వాటిల్లింది. పంటలు చేతికి అందోచ్చే సమయానికి ప్రకృతి కన్నెర్ర చేయడంతో తమ కళ్లముందే పంటలు ధ్వంసమైతున్నాయని మామిడి, వరి రైతులు గుండెలు బాధుకుంటున్నారు.

పాలనపై పట్టు కోల్పోయి విమర్శలు

- మాజీ ఎంపీ సీతారాంనాయక్



మాట్లాడుతున్న సీతారాంనాయక్

డోర్నకల్: సీఎం రేవంత్‌రెడ్డి పాలనతోపాటు మంత్రులపై పట్టు కోల్పోయి మోదీపై విమర్శలు చేస్తున్నారని మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. స్థానిక జైస్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. బీజేపీ రిజర్వేషన్ తొలగిస్తుందని, రాజ్యాంగాన్ని సవరిస్తుందని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తుందన్నారు. సుదీర్ఘ కాంగ్రెస్ పాలనలో అంబేడ్కర్‌కు గౌరవం లభించలేదన్నారు. ఈనెల 19న ఉదయం 10.30గంటల నుంచి డోర్నకల్‌లో అంబేడ్కర్ విరాసత్ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అంబేడ్కర్‌వాదులు, మేధావులు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దేవానాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వ్యాస్ లక్ష్మీనారాయణ, నాయకులు చీకటి మహేష్‌గౌడ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు సరికాదు

తొర్రూరు: ప్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు సరికాదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రమేష్ అన్నారు. డివిజన్ కేంద్రంలో బుధవారం టీపీటీఎఫ్ మండల కమిటీ సమావేశంలో రమేష్ మాట్లాడారు. నూతన జాతీయ విధాన చట్టం ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేయాలని, వాటిని ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. ఈ నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలను పాతర వేయడానికేనని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండం జనార్దన్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, ఉపేందర్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి ఖాయం



మాట్లాడుతున్న హామ్యానాయక్

తొర్రూరు: మాజీ మంత్రి ఎర్రబెల్లి ఉత్తర కుమార ప్రగల్బాలు మానుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. హామ్యానాయక్ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని దయాకర్‌రావు కలలు కంటున్నాడన్నారు. బీఆర్ఎస్ ప్రజాబలం కోల్పోయిందని, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో చావు దెబ్బతిన్న బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓటమి చెందడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతోష్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్, ఏఎంసీ డైరెక్టర్లు అచ్చిరెడ్డి, వెంకటాచారి, రామచంద్రయ్య, పాల్గొన్నారు.

తడిసిన మక్కలను కొనుగోలు చేయాలి



వేరుశనగలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్

మహబూబాబాద్ రూరల్: అకాల వర్షానికి తడిసిన మొక్కజొన్నలను మార్కెట్ ధరకే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న, సహాయ కార్యదర్శి నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం, మొక్కజొన్నలు, వేరుశనగ, పత్తి, మిర్చిని తెలంగాణ రైతు సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి వివిధ పంట ఉత్పత్తులు వర్షానికి తడిసిపోయాయని, మార్కెట్ పాలకవర్గం, అధికారులు తక్షణమే స్పందించి వ్యాపారులతో మొక్కజొన్నలను పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలి

డోర్నకల్: వేసవి దృష్ట్యా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సరఫరా విభాగంతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

విధుల్లో ఉన్న ఉపాధ్యాయుడికి అస్వస్థత

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ఈదర వెంకటేష్ ఒక్కసారిగా అస్వస్థతకు గురై పడిపోయాడు. తక్షణమే స్పందించిన తోటి ఉపాధ్యాయులు 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు

డోర్నకల్: స్థానిక అమ్మపాలెం క్రాస్‌రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదురుగా భూమిలో భగీరథ పైపు పగలడంతో బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది పగిలిన పైపులకు మరమ్మతులు చేసి నీటి సరఫరాను క్రమబద్ధీకరించారు.

విద్యుత్ షాక్‌తో ఆవుల మృతి

నర్సింహులపేట: మండలంలోని జయపురంలో మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ షాక్‌తో రెండు పాడి ఆవులు మృతి చెందాయి. జయపురంలోని వీరబోయిన మల్లయ్య ఇంటి ముందర రేకుల కొట్టంలో రెండు ఆవులను కట్టేశారు. ఈదురు గాలులు, భారీవర్షంతో రేకుల షెడ్డు కూలింది. దీంతో విద్యుత్ తీగలు రెండు ఆవులకు తగిలాయి. షాక్‌కు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.1లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు విలపించాడు. పశు వైద్యాధికారి సౌమ్య ఘటన స్థలం చేరుకొని పరిశీలించారు.

మాంసం స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

బయ్యారం: మండలంలోని బాలాజీపేట సమీపంలో బుధవారం అటవీశాఖాధికారులు మాంసంను స్వాధీనం చేసుకున్నారు. వేటగాళ్లు పెట్టిన ఉచ్చుకు పడిన జంతువు మాంసంను కొందరు వ్యక్తులు కోస్తున్నారనే సమాచారంతో అటవీ అధికారులు వెళ్లి దొరికిన మాంసంను స్వాధీనం చేసుకున్నారు. అయితే అధికారులకు దొరికిన మాంసం అటవీ జంతువుగా స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై అటవీశాఖ డీఆర్వో ఉమారాణిని వివరణ కోరగా తమకు మాంసం లభ్యమైన మాట వాస్తవమేనని మాంసంను పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపామని త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

మహిళ మృతిపై విచారణ

గార్ల: గార్ల రైల్వేస్టేషన్ సమీపంలో వడదెబ్బకు గురై మృతిచెందిన బాదంపూడి సుశీల ఇంటికి బుధవారం వైద్య, రెవెన్యూ, పోలీస్ అధికారులు వచ్చి విచారణ చేపట్టారు. మంగళవారం మిర్చితోటలో కాయలు ఏరేందుకు వెళ్లి తోటలో వడదెబ్బకు గురై సుశీల మృతిచెందింది. అధికారులు మృతురాలుతో కూలీకి వెళ్లిన కూలీలను, కుటుంబ సభ్యులను విచారించగా, 2రోజులుగా సుశీలకు వాంతులు, విరోచనాలు అవుతుండటంతో సెలెన్ బాటిళ్లు ఎక్కించుకుందని కూలీలు అధికారులకు తెలిపారు. విచారణ తుది నివేదికను జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓ లకు సమర్పిస్తామని ప్రభుత్వ వైద్యాధికారి రాజ్‌కుమార్ జాదవ్, ఆర్ఐ స్వప్న తెలిపారు.

ఎస్సై ఆర్థికసాయం

మరిపెడ రూరల్: మరిపెడ ఎస్సై బొలగాని సతీష్ తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. రోడ్డు ప్రమాదానికి గురై ఇంటికే పరిమితమైన వ్యక్తి కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందించి పోలీసులో ఉన్న మానవత్వాన్ని చాటుకున్నాడు. వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లంపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని బొట్యతండా గ్రామ పంచాయతీకి చెందిన ధరంసోత్ నవీన్ బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో మతిస్థిమితం సరిగా లేదు. దీంతో పనికి వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. ఈక్రమంలో కేసు దర్యాప్తు కోసం బాధితుడు నవీన్ ఇంటికి వెళ్లిన ఎస్సై సతీష్ నవీన్ దీనస్థితిని చూసి ఆర్థిక సాయం చేశాడు.

అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం సీజ్



పట్టుకున్న నల్లబెల్లం వాహనం చూపుతున్న ఎస్సై రమేశ్ బాబు

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం వాహనాన్ని పట్టుకున్న సంఘటన నెల్లికుదురు మండల కేంద్రంలోని క్రాస్ రోడ్‌వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా రూ.2.50లక్షల విలువ చేసే 48బస్తాల నల్లబెల్లం, 2బస్తాల పటిక బెల్లం ఉందన్నారు. బీదర్ నుంచి తక్కువ ధరకు తెచ్చి తండాలల్లో ఎక్కువ ధరకు విక్రయించి అక్రమంగా సొమ్ము చేసుకునేందుకు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ తండాకు చెందిన బాదావత్ సురేష్, కోమటి పల్లికి చెందిన సపావత్ సంతోష్, వేమునూరు గ్రామ శివారు రాయకుంట తండాకు చెందిన భూక్య చంద్రు, కురవి మండలం జగ్గయ్య తండాకు చెందిన కేలోతు హరిసింగ్‌లు కలిసి నల్లబెల్లం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చర్యలు చేపట్టాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టి, రాజీవ్ యువవికాసం పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ బాలరాజు, తహసీల్దార్ రాజు, మిషన్ భగీరథ గ్రిడ్ డిప్యూటీ కార్యనిర్వాహక ఇంజనీరు శ్రావణ్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గార్ల: నేటి సమాజంలో యువత మత్తు పదార్థాలను విడనాడాలని గార్ల డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.నాగూర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులు రామ్మోహన్‌రావు, చార్లీ, పున్నంచందర్, రాజేష్, సుందరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

తొర్రూరు: రెవెన్యూ డివిజన్‌గా కొనసాగుతున్న తొర్రూరులో అన్నిరకాల ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. తొర్రూరు ప్రాంత సమస్యల పరిష్కారం కోరుతూ వామపక్ష పార్టీలతో కూడిన జేఏసీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఎదుట ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు బుధవారం కొనసాగాయి.

వీధి కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

చిన్నగూడూరు: వీధి కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన దేశగాని వెంకన్న టీవీఎస్ వాహనంపై ఇంటి నుంచి బస్టాండ్‌కు వెళ్తున్న క్రమంలో దాశరథి గ్రంథాలయం వద్ద వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో వెంకన్నకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రానికి తరలించారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం పట్టణంలో గల మహాలక్ష్మి ట్రేడింగ్ కంపెనీలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ ఎన్.తిరుపతిరావు అన్నారు. బుధవారం డీఎస్పీ తిరుపతిరావు కేసు వివరాలు వెల్లడించారు. కేసముద్రం పట్టణంలోగల మహాలక్ష్మి ట్రేడింగ్ కంపెనీలో ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి దొంగతనం జరగగా సంస్థ యజమాని గార్లపాటి ప్రమోద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు విచారణలో భాగంగా కేసముద్రం, మానుకోట సీసీఎస్ పోలీసులు బోడ మంచ్య తండా గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా కనిపించగా అతడిని అదుపులోకి తీసుకుని విచారించారని తెలిపారు. దీంతో తాను మహాలక్ష్మి ట్రేడింగ్ కంపెనీలో దొంగతనం చేసినట్లు నిందితుడు నేరాన్ని ఒప్పుకున్నాడన్నారు. నెల్లికుదురు మండలంలోని రత్తిరాం తండాకు చెందిన గుగులోతు నవీన్ గా గుర్తించి, అతడి వద్ద నుంచి రూ.5లక్షలకుపైగానగదు, కొత్త పల్సర్ బైక్, రెండు బంగారం రింగులు, ఒక వెండి బ్రాస్లెట్, ఒక మొబైల్ ఫోను స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు. దొంగతనాన్ని చేదించే విషయంలో ప్రతిభ కనబరిచిన మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య,గారిని, సీసీఎస్ సీఐ హతిరాం, ఎస్సై తాహెర్ బాబా, కేసముద్రం ఎస్సై మురళీధర్, అదనపు ఎస్సై కరుణాకర్, కానిస్టేబుల్ రాంచందర్ తదితరులను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

కేసముద్రం: విద్యుత్‌షాక్‌కు గురై ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తిలో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సంతో నాగెల్లి ఉప్పలమ్మ(65) అనే వృద్ధురాలి ఇంటి ముందర విద్యుత్ తీగలు తెగి ఇంటి ఆవరణంలో పడ్డాయి. తెల్లవారుజామున నిద్రలేచిన ఉప్పలమ్మ కిందపడిన విద్యుత్ తీగను గమనించకుండా కాలితో తొక్కింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐదుగురి అరెస్టు

గూడూరు: దాడి చేసుకున్న కేసులో కోర్టుకు హాజరుకానందుకు బుధవారం ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని గుండెంగ శివారు గణ్యచక్రుతండాలో 2021లో జరిగిన భూతగాదలో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వారు ప్రతీ నెలా కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. కానీ హాజరుకాలేదు. దీంతో అరెస్టు చేసి కోర్టుకు తరలించగా, జడ్జి వారికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.





సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646